

అటకెక్కిన అభివృద్ధి

అంగట్లో అన్నీ ఉన్నా.. అల్లుడి నోట్లో శని అంటే ఇదేనేమో. కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు పుష్కలంగా నిధులున్నప్పటికీ అడుగు ముందుకు పడడం లేదు. 142 పనులకు టెండర్లు పూర్తయినా కొందరు నేతల మెప్పు కోసం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. వీరి అలసత్వం.. జనానికి శాపంగా మారుతోంది. పర్సంటేజీల కోసమే అధికార పార్టీ నేతలు పనులు ఆపుతున్నట్లు విమర్శలున్నాయి.

- కార్పొరేషన్‌లో రూ.14.13 కోట్ల ఆర్థిక సంఘం నిధులు
- 142 పనులు చేపట్టేందుకు టెండర్లు
- రెండు నెలలైనా మొదలు కాని పనులు
- కార్పొరేషన్ అధికారుల అలసత్వం.. జనానికి శాపం
- పర్సంటేజీల కోసం పనులు ఆపుతున్న అధికార పార్టీ నేతలు



అశోక్‌నగర్‌లో ఓ రోడ్డు దుస్థితి

(కడప-ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నేతృత్వంలో కూటమి సర్కారు సంక్షేమంతో పాటు అభివృద్ధిని ఏడాదిగా పరుగులు పెట్టిస్తోంది. గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వాటర్, ఇతర అభివృద్ధి పనులు చేపట్టింది. ఇక కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో కూడా అభివృద్ధి పనులను చేపడుతుంది. కేంద్రం, రాష్ట్రంలోనూ ఎన్‌డీఏ సర్కారు ఉండడంతో కార్పొరేషన్, మున్సిపాలిటీల్లో ఆర్థిక సంఘం నిధులు, గ్రామీణ ప్రాంతాలకు ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు కేటాయిస్తూ అభివృద్ధి చేస్తూ వస్తోంది. ఇందులో భాగంగానే కడప కార్పొరేషన్‌కు 15వ ఆర్థిక సంఘం నిధులు కేటాయించారు. ఈ నిధుల్లో రూ.14.13 కోట్ల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, వీధిలైట్లు ఇతర వాటిని చేపట్టాలని నిర్ణయించారు. టెండర్లు కూడా ఆహ్వానించారు.

మొదలు కాని పనులు

కార్పొరేషన్‌లో కొందరు అధికారుల నిర్లక్ష్యం కారణంగా టెండర్లు పూర్తయినా ఇప్పటికీ పనులు మొదలుకాలేదు. కడప నగరం వర్షం వచ్చిందంటే చిగురుటాకులా వణికిపోతుంది. ఎందుకంటే నగరంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేదు. అడ్డగోలుగా రహదారులు, డ్రైనేజీని ఆక్రమించి ఇష్టారాజ్యంగా భవన నిర్మాణాలు చేపట్టారు. వర్షం వచ్చిందంటే కడప లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురవుతూ ఉంటాయి. గత వైసీపీ హయాంలో సంభవించిన వర్షాలకు కడప నగరం తీవ్ర ముంపునకు గురైంది. ఇష్టారాజ్యంగా, అడ్డగోలుగా భవన నిర్మాణం చేపట్టడం వల్ల వర్షం నీరు వెళ్లేదారి లేకపోయింది. గతంలో పనిచేసిన అధికారి ప్రవీణ్‌చంద్ కొంత మేర ఆక్రమణలు తొలగించి ఆర్టీసీ బస్టాండు, ఇంకా కొన్ని ప్రాంతాల్లో సమస్య తీవ్రతను తగ్గించారు.

ప్రభుత్వానికి చెడ్డ పేరు

కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ సెక్షన్‌లో గత వైసీపీ హయాంలో పనిచేసిన కొందరు అధికారులు ఇంకా పనిచేస్తున్నారు. అప్పట్లో వైసీపీ నేతలు తమ బంధువులని చెప్పుకుంటూ ఐదేళ్ల కాలం గడిపారు. ఇప్పుడు కూడా టీడీపీ ముఖ్య నేతలు తమ బంధువులని చెప్పుకుంటున్నారు. పోనీ వారి వల్ల ఏమన్నా ఒరిగిందా అంటే అదీ లేదు. ఆర్థిక సంఘం నిధులు టెండర్లు పూర్తయి రెండు మాసాలు దాటినా ఇంకా పనులు మొదలుకాలేదు. వర్షాకాలం మొదలవుతుంది.. వర్షాలు రాకమునుపే ప్రారంభించి ఉంటే ఈ పాటికి సీసీ రోడ్లు, డ్రైనేజీలు పూర్తయ్యేవి. ఇప్పుడు వర్షాలు పడితే మరో రెండు నెలలైనా పనులు మొదలు కావు. దీనంతటికీ ఆ అధికారులే కారణమని పలువురు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

మెప్పు కోసం

వైసీపీ హయాంలో ఆర్థిక సంఘం నిధుల్లో కూడా కార్పొరేటర్ల నుంచి పర్సంటేజీ తీసుకున్నారు. ఇది అప్పట్లో పెద్ద దుమారం రేపుతూ వచ్చింది. దీంతో చేపట్టిన పనుల్లో కూడా నాణ్యత లేదన్న విమర్శ ఉండేది. ఇప్పుడు అధికారులు కొందరు అధికార పార్టీ నేతల మెప్పు కోసం ఉద్దేశ్యపూర్వకంగానే పనులు ప్రారంభించకుండా, మీరు పనులు చేయాలంటే డివిజను నేతలతో మాట్లాడుకోవాలని చెబుతూ కొర్రీలు వేస్తున్నారనే చర్చ నడుస్తోంది. మొత్తానికైతే అధికారుల వ్యవహార శైలి అభివృద్ధి పనులకు గ్రహణం పట్టింది.

అభివృద్ధి పనులకు గ్రహణం

సీఎం చంద్రబాబునాయుడు తొలి ఏడాదిలోనే పల్లెలు, ఇటు పట్టణాల్లో పనులను చేపట్టడం కోసం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. కడప కార్పొరేషన్‌లో సుమారు 4లక్షల పైచిలుకు జనాభా ఉంది. ఇక్కడ కూటమి అభ్యర్థులు గెలిచారు. ఆర్థిక సంఘం నిధులు మంజూరయ్యాయి. ఇందులో రూ.14.13 కోట్ల వ్యయంతో 142 పనులు చేపట్టాలని నిర్ణయించారు. ఈ మేరకు టెండర్లు ఖరారు చేశారు. రూ.3.73 కోట్లతో 59 సీసీ రోడ్లు, డ్రైన్స్, రూ.6.57 కోట్లుతో 74 సీసీ రోడ్లు, రూ.1.50 కోట్లతో 8 చోట్ల తాగునీటి సరఫరా పనులు, 2.30 కోట్లతో వీధిలైట్లు పనులు చేసేందుకు టెండర్లు పిలిచారు. అన్నీ పూర్తయ్యాయి. కాంట్రాక్టర్లు కూడా పోటీ పడి కొన్ని పనులను లెస్‌కు దక్కించుకున్నారు.

నగర పాఠశాలకు రాష్ట్రస్థాయి గుర్తింపు

● విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందన




నారాలోకేశ్ స్టేటస్‌లో కడప ఎనిమిదవ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాల ఫొటో ఫ్రేమ్

కడప ఎడ్యుకేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కడప నగరపాలక సంస్థ పరిధిలోని సాయిపేట 8వ వార్డు ఆదర్శ ప్రాథమిక పాఠశాలకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించింది. ఈనెల 10న నిర్వహించిన మెగా పేరెంట్స్ టీచర్స్ (మెగా పీటీఎం 2.0) సమావేశంలో విద్యార్థులు, తల్లిదండ్రులకు సంబంధించిన ఫొటో ఫ్రేమ్ రూపకల్పనలో పాఠశాల ఉపాధ్యాయులు రూపొందించిన చిత్రానికి రాష్ట్రస్థాయిలో అగ్రస్థానం లభించింది. దీనికి సంబంధించి సమగ్ర శిక్ష అభియాన్ రాష్ట్ర పోర్టల్‌లో ముఖచిత్రంగా ఏర్పాటు చేశారు. దీంతో పాటు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పాఠశాల ఫొటో చిత్రాన్ని తన స్టేటస్‌తో పాటు సామాజిక మాధ్యమాల్లో ట్యాగ్ చేస్తూ పోస్ట్ చేశారు. పీటీఎం 2.0 సరికొత్త చరిత్ర సృష్టించిందని, విద్యా వ్యవస్థ వికాసానికి ఇది దోహదం చేస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లాకు చెందిన పాఠశాలకు రాష్ట్రస్థాయిలో ప్రత్యేక గుర్తింపు లభించడం పట్ల విద్యాశాఖ, సమగ్ర శిక్ష అభియాన్ అధికారులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందానికి అభినందనలు తెలిపారు.

17న రెండవ విడత కౌన్సెలింగ్

● ట్రిపుల్‌ఐటీలో 907 మంది జాబితా విడుదల



వేంపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఆర్జీయూకేటీ పరిధిలోని నాలుగు ట్రిపుల్‌ఐటీల్లో మొదటి విడత అడ్మిషన్ కౌన్సెలింగ్ జూలై 5వ తేది నాటికి ముగిసింది. మెరిట్ విద్యార్థుల జాబితాను శనివారం రాత్రి ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సండ్రా ప్రకటించారు. మొదటి విడతలో 3400 సీట్లను భర్తీ చేయగా, పీహెచ్ 179 సీట్లు, క్యాప్ 88 సీట్లు, భారత్ స్కౌట్స్ 20 సీట్లతో పాటు రెండో జాబితాలో 907 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. నాలుగు ట్రిపుల్‌ఐటీలకు కేటాయించినట్లు తెలిపారు. ఈ నెల 17న అడ్మిషన్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీకి ఎంపికైన వారికి ఇడుపులపాయలో, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్‌ఐటీలకు ఎంపికైన విద్యార్థులకు నూజివీడు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో అడ్మిషన్ కౌన్సెలింగ్ ఉంటుందన్నారు. ట్రిపుల్‌ఐటీలో చేరదలచుకున్న విద్యార్థులకు లగేజీతో రావాలని తెలిపారు. కాగా ఎన్‌సీసీ కోటాలో 40 సీట్లు, క్రీడా కోటాలో 20 సీట్లు మాత్రమే మిగిలి ఉన్నాయని, వీటిని త్వరలోనే ప్రకటించి విద్యార్థులను జాయిన్ చేసుకుంటామన్నారు. మొదటి విడత చేసిన విద్యార్థులకు వారి విజ్ఞప్తి మేరకు ఒక ట్రిపుల్‌ఐటీ నుంచి మరో ట్రిపుల్‌ఐటీకి ట్రాన్స్‌ఫర్లు చేసినట్లు తెలిపారు.

ఉత్తరాఖండ్‌లో శిక్షణకు జేసీ అదితిసింగ్



కలికిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరీ ఐఏఎస్ అకాడమీలో మూడు రోజుల శిక్షణ కోసం కడప జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఎంపిక చేసింది. పల్నాడు, విశాఖపట్నం జేసీలు గనోర్ సూరజ్ ధనంజయ్, కథవాడే మయూర్ అశోక్‌లతో పాటు కడప జేసీని మూడురోజుల శిక్షణలో పాల్గొనేందుకు ఆదివారం సాయంత్రం రిలీవ్ చేస్తూ ప్రభుత్వం ఆదివారం ఉత్తర్వులు జారీ చేసింది. 'మౌలిక సదుపాయాల ప్రాజెక్టుల కోసం భూసేకరణ' అనే అంశంపై వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. 16 నుంచి 18 వరకు మూడు రోజుల శిక్షణకు హాజరయ్యేందుకు 15వ తేది నాటికి అక్కడ అందుబాటులో వుండేందుకనువుగా ఆదివారమే ఈ ముగ్గురినీ ప్రభుత్వం విధుల నుంచి రిలీవ్ చేసింది. జేసీల స్థానాల్లో ఇన్‌చార్జులను నియమించేందుకు ఆయా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని కూడా ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు సాధారణ పరిపాలనా శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా ఆదివారం ఆదేశాలు జారీ చేశారు.

గండికోట ప్రాజెక్టులో 14.4 టీఎంసీలు

కొండాపురం, జూలై 13(ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టులో ప్రస్తుతం 14.4 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. గండికోట ప్రాజెక్టు నుంచి మెయిన్‌కెనాల్‌కు 150 క్యూసెక్కులు, తాగునీటి అవసరాల దృష్ట్యా 20 క్యూసెక్కుల నీటిని వదులుతున్నామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులోకి వచ్చే ఇన్‌ఫ్లో లేదని, కాగా గండికోట ప్రాజెక్టు పూర్తి నీటి సామర్థ్యం 26.85 టీఎంసీలు అని ఈఈ తెలిపారు.



గండికోట ప్రాజెక్టు

విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేసిన వైసీపీ

- శాఖపై రూ.1.30 లక్షల కోట్లు భారం
- భవిష్యత్‌లో విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదు
- విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్, చిత్రంలో రితీష్‌రెడ్డి తదితరులు

బద్వేల్‌టౌన్/కాశినాయన, జూలై 13 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం విద్యుత్ వ్యవస్థను సర్వనాశనం చేసిందని, ఆ శాఖపై రూ.1.30 లక్షల కోట్ల భారం మోపిందని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. ఆదివారం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బద్వేలు పట్టణం, కాశినాయన మండలంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బద్వేలు టీడీపీ కార్యాలయానికి ఆయన చేరుకున్నారు. ఆయనకు బద్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ పరిశీలకుడు నాగేంద్ర, విద్యుత్ శాఖ అధికారులు ఘనస్వాగతం పలికారు. అనంతరం విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సోలార్ ఎనర్జీకి 7వేల మెగావాట్ల ఉత్పత్తి చేసినట్లు పేర్కొన్నారు. గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల అధికారంలో ఉన్నప్పటికీ జగన్‌రెడ్డి ప్రభుత్వం ఒక్క మెగావాట్ విద్యుత్‌ను కూడా ఉత్పత్తి చేయలేదన్నారు. భవిష్యత్తులో విద్యుత్ చార్జీలు పెంచే ప్రసక్తే లేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తోందని, రాయలసీమ ప్రాంతంలో గ్రీన్ ఎనర్జీకి అనువైన ప్రదేశమన్నారు. అనంతరం నియోజకవర్గ ఇన్‌చార్జి రితీష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో మరో ఆరు సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు అనుమతులు ఇవ్వాలని మంత్రిని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా సంప్రదించారు. అనంతరం జిల్లాలో జరుగుతున్న ఆర్డీఎస్ఎస్ పనుల పురోగతిపై విద్యుత్ శాఖ అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. అనంతరం కాశినాయన మండలం బాలాయపల్లెలో జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో బద్వేల్ టీడీపీ ఇంచార్జి రితీష్‌రెడ్డితో పాటు ఆయన పాల్గొని మాట్లాడారు. పలువురి ఇంటివద్దకు వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కూటమి నేత బొజ్జ రోశన్న, ప్రసాదరెడ్డి, గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్‌కుమార్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు వెంగల్‌రెడ్డి, రాగిమాను ప్రతాప్‌కుమార్, ప్రసాద్, శివయ్యస్వామి, రవికుమార్, రామచంద్రారెడ్డి, సీనియర్ న్యాయవాది ప్రసాద్, బిగ్‌బాస్, నాగభూషణం, నరసింహనాయుడు, రామానాయుడు తదితరులు పాల్గొన్నారు.

మూఢాచారాలు బాధాకరం

● జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు బి.విశ్వనాథ్



గాలిలో తేలుతూ కూర్చున్న బాల సన్యాసినులు

కడప ఎడ్యుకేషన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): అంతరిక్షంలోకి రాకెట్లను పంపుతున్న నేటి కాలంలో చేతబడులు వంటి మూఢాచారాలతో ప్రాణాల ను తీయడం బాధాకరమని జేవీవీ జాతీయ ఉపాధ్యక్షుడు బి.విశ్వనాథ్ పేర్కొన్నారు. ఆదివారం కడప నగర యూటీఎఫ్ భవన్‌లో జేవీవీ రాష్ట్ర మహాసభల రెండవరోజు సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎర్రముక్కపల్లె సర్కిల్ నుంచి సంధ్య సర్కిల్ వరకు శరీరం వెనుక వైపు కొక్కీలు తగిలించుకొని కారు లాగే కార్యక్రమాన్ని నిర్వహించారు. గాలిలో తేలుతూ కూర్చున్న బాల సన్యాసుల విన్యాసాలను, మ్యాజిక్ షోలను ప్రదర్శించారు. సంధ్య సర్కిల్ నుంచి కళాశాల వరకు జేవీవీ ప్రతినిధులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో విశ్వనాథ్ మాట్లాడుతూ మేధావులు, ఉపాధ్యాయ, అధ్యాపకులు మూఢాచార నిర్మూలనలో ప్రధాన భూమిక పోషించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.గోపాల్‌నాయక్ మాట్లాడుతూ ఇటీవల జరుగుతున్న మూఢ నమ్మకాలకు వ్యతిరేకంగా జనవిజ్ఞాన వేదిక పోరాడుతుందని, ముఖ్యంగా బాలబాలికల సంపూర్ణ ఆరోగ్యం విద్య పర్యావరణ పరిరక్షణ తదితరాల కోసం జేవీవీ కృషి చేస్తుందన్నారు. రాష్ట్ర కోశాధికారి పి.సనావుల్లా, జేవీవీ సలహా మండలి సభ్యుడు కె.సురేష్ బాబు మాట్లాడుతూ భవిష్యత్తులో జనవిజ్ఞాన వేదిక అవసరం సమాజానికి మరింతగా ఉందని, యువతరం ముందుకు వచ్చి జేవీవీ ఆశయాల సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం రాష్ట్రనాయకులు శ్రీనివాసులు, సుధాకర్‌రెడ్డి, రామారావు, మురళీధర్, సుదర్శన్, వరలక్ష్మి, మీనా, సుజాత, స్వరాజ్యలక్ష్మి ప్రసంగించారు.

సౌమ్యనాథునికి చక్రస్నానం






నందలూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : సౌమ్యనాథస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీదేవి భూదేవి సమేత స్వామివార్లకు ఆదివారం అత్యంత వైభవంగా చక్రస్నానం జరిగింది. టీటీడీ అధికారుల ఆధ్వర్యంలో ముగింపు ఉత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. ముందుగా ఉదయం సౌమ్యనాథునికి గ్రామోత్సవం, వసంతోత్సవం జరిగింది. ఆలయంలో ఉత్సవమూర్తులకు సుగంధ పరిమళ గంధం, పాలు, తేనె, నెయ్యి వివిధ రకాల ఫలాలతో అభిషేకం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం పాంచరాత్ర ఆగమ పండితులు రఘునందన్, పవన్‌కుమార్, మనోజ్‌కుమార్, సునీల్‌కుమార్, సాయి స్వామిలు ఉత్సవ మూర్తులకు కోనేటిలో చక్ర స్నానం నిర్వహించారు. కార్యక్రమంలో టీటీడీ డిప్యూటీ ఈవో ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతప్ప, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిలీప్‌కుమార్, విజిలెన్స్ అధికారి శేషాచలం, భక్తులు పాల్గొన్నారు. రాత్రి 7 గంటలకు ధ్వజావరోహణ కార్యక్రమాన్ని పాంచరాత్ర ఆగమ పండితులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సోమవారం రాత్రి సౌమ్యనాథస్వామికి పుష్పయాగం నిర్వహించనున్నట్లు ఆలయ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

నగరంలో ఫ్లెక్సీ కలకలం

కడప క్రైం, జూలై 13(ఆంధ్రజ్యోతి): కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల గ్రౌండ్ వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన 'ఎంత పని చేశావయ్యా జగనూ..' అంటూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ కలకలం రేపింది. ఎంగిలి చేత్తో కాకిని కూడా తోలడం ఇష్టం లేని ఆయనకు సంక్షేమం అంటే ఏంటో నేర్పిస్తుం దావు అనే వివిధ పాయింట్లతో ఫ్లెక్సీ ఏర్పాటు చేశారు. ప్రస్తుత అధికార పార్టీని దృష్టిలో పెట్టుకుని కించపరిచే విధంగా సగం ముఖం కనిపించేలా వైఎస్ జగన్ ఫొటోతో ఏర్పాటు చేశారు. దీంతో ఆదివారం రాత్రి వైసీపీకి చెందిన ఇరువురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. కడప ఆర్ట్స్ కళాశాల వద్దనే ఏర్పాటు చేశారా.. లేక ఇతర ప్రాంతాల్లో కూడా వీటిని ఏర్పాటు చేశారా అనే కోణంపై విచారిస్తున్నట్లు తెలుస్తోంది.



కడప నగరంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కన్నుల పండువగా మహా శోభాయాత్ర

కడప కల్చరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): కడప నగరంలో ఆదివారం నిర్వహించిన సనాతన ధర్మ పురోహిత మహా శోభాయాత్ర కన్నుల పండువగా సాగింది. జిల్లా హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వారణాసి శ్రీధర్‌శర్మ సారథ్యంలో నగర మృత్యుంజయకుంట శివాలయం నుంచి మహాశోభాయాత్ర ప్రారంభమైంది. నగర పురవీధుల గుండా అన్నమాచార్య సర్కిల్ వరకు అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. యాత్ర ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా అభయ్ హిందూ సేవ వ్యవస్థాపకుడు రాధామనోహరదాసు స్వామిజీ హాజరై జెండా ఊపి ప్రారంభోత్సవం గావించారు. యాత్ర ముందుభాగాన దాస ఆంజనేయ కోలాట బృందం (జమ్మలమడుగు) వారిచే ఏర్పాటు చేసిన కోలాటం ప్రజలను ఆకట్టుకుంది. అనంతరం ఆయన మాట్లాడుతూ కాలగమనంలో సనాతన ధర్మ విలువలు అంతరించిపోకుండా పదికాలాల పాటు ప్రజల మదిలో నిలిచి వుండాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమం తలపెట్టామన్నారు. ప్రస్తుత రోజుల్లో ఆనాటి మానవ విలువలు, కట్టుబాట్లు, నడవడిక కనుమరుగవుతున్నాయని, ఒకప్పటి మనుషుల్లో ఏహ్యాభావాలు, అసూయ, ద్వేషం ఉండేది కాదని, కల్మషం లేని వాతావరణం వుండేదన్నారు. దైవభక్తి, పెద్దల పట్ల గౌరవం, వున్నప్పుడే సనాతన ధర్మం విరాజిల్లుతుందన్నారు. సాటి మనిషికి సాయం చేయలేకపోయినా పర్వాలేదు కానీ చెడు తలపెట్టకూడదని, అలా చేస్తే దేవుడి ఆశీస్సులు తప్పక లభిస్తాయన్నారు. కార్యక్రమంలో ఏపీ పురోహిత బ్రాహ్మణ సమాఖ్య జిల్లా కోశాధికారి నరసింహబట్టర్, జగదీష్, వై.నరసింహమూర్తి, సాయిమిత్రశర్మ జిల్లా అర్చక సంఘం నాయకుడు సతీష్ శశిధర్‌శర్మ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటసుబ్బారెడ్డి, జనసేన నాయకులు రమణయ్య, నాయకులు వి.వి.చలపతితో పాటు పలువురు పురోహితులు, పాల్గొన్నారు.



శోభాయాత్రలో మాట్లాడుతున్న రాధామనోహరదాసు స్వామిజీ



నగరంలో సాగుతున్న శోభాయాత్ర

పోలేరమ్మకు బోనాలు



బోనాలతో తరలివెళుతున్న మహిళలు

బద్వేలు రూరల్, జూలై 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శివానగర్ ప్రజలు ఆదివారం స్థానిక రూపరాంపేట శివాలయం సమీపంలో ఉన్న పోలేరమ్మకు బోనాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలతో శివానగర్ నుంచి బయలుదేరి పోలేరమ్మ ఆలయం వరకు ఊరేగింపుగా తరలివెళ్లారు. అమ్మవారికి బోనం కూడు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో శివానగర్ మహిళలు, రంగయ్య, మనోజ్, చిన్న, గోపయ్య, రవి, వేణు, క్రిష్ణ, మురళి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

కంకర..కరకరా..!

● కరిగిన మోరీలు ● కమ్మి తేలిన రోడ్లు ● ప్రయాణం నరకం ● అధ్వానంగా బోడిమలదిన్నె రహదారి



బోడిమలదిన్నె గ్రామంలో కంకర తేలి పైకిలేచిన కమ్మీలు

మదనపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కంకర తేలి.. కమ్మి కనిపిస్తూ.. కరిగిపోయిన మోరీలు.. మదనపల్లె నుంచి బోడిమలదిన్నె మీదుగా నిమ్మనపల్లె మండలానికి వెళ్లే లింకు రోడ్డు దుస్థితి ఇది. రోడ్లు, భవనాల శాఖకు చెందిన ఈ రోడ్డును 2013లో మట్టి నుంచి తారురోడ్డుగా మార్పు చేసింది. స్థానిక ఇండస్ట్రియల్ ఎస్టేట్ నుంచి వికలాంగుల కాలనీ, ఇసుకనూతిపల్లె, కొండామరిపల్లె, బెస్తపల్లె, బోడిమలదిన్నె మీదుగా నిమ్మనపల్లె మండలం గారబురుజుకు వెళ్లే గ్రామీణ రోడ్డు ఇది. 6 కి.మీ. దూరం గల ఈ మార్గంలో అయిదు బ్రిడ్జిలు, కొండామరిపల్లె సమీపంలోని మంగళపల్లె చెరువుకు రైలింగ్ గోడ నిర్మించారు. మొత్తం తారు రోడ్డు అయినప్పటికీ కొండామరిపల్లె, బెస్తపల్లె, బోడిమలదిన్నె గ్రామాల్లో సిమెంటు రోడ్డు వేశారు. పైప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు ప్రవహించే, చెరువు మొరవలు ఉండే ప్రాంతాల్లో సిమెంటు కాంక్రీటు నిర్మాణంతో రోడ్డు వేశారు. తర్వాత అయిదు కి.మి.మేర తారురోడ్డు వేశారు. అంతవరకు బాగానే ఉన్నా..ఈ రోడ్లు వేసిన రెండేళ్లకే కంకర తేలిపోయి, గ్రామంలో సిమెంటు కాంక్రీటులో వేసిన కమ్మీలు బయట కనపడుతున్నాయి. అలాగే రోడ్డు వెంట నిర్మించిన బ్రిడ్జి (మోరీ)లకు అటు, ఇటు నిర్మించిన రైలింగ్ గోడలు కూడా కరిగిపోయాయి. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించకపోవడంతో రెండేళ్లకే ఈ దారుణ పరిస్థితికి వచ్చాయి.

అయితే తారురోడ్డు కూడా అక్కడక్కడా కంకర తేలి గుంతలు పడగా, తర్వాత గతుకులకు అతుకులు వేశారు. కానీ సిమెంట్ రోడ్డును మాత్రం అలాగే వదిలేశారు. పది గ్రామాల ప్రజలు, రైతులు నిత్యం పట్టణానికి రాకపోకలు సాగిస్తుంటారు. కంకర లేచిన రోడ్డులో ప్రయాణం అంటేనే భయపడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు ఆ రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడుతున్నారు. కంకర రాళ్లతో నిత్యం వాహనాల టైర్లు పంక్చర్ అవుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. వాహనాల ప్రయాణం పక్కన పెడితే, నిత్యం ఇళ్ల నుంచి బయటకు వచ్చి తిరగడమే గగనంగా మారింది. ఈ రోడ్లను బాగు చేయాలని స్థానికులు కొన్నేళ్లుగా కోరుతున్నా..ప్రయోజనం లేదు. గ్రామాలకు వచ్చిన పాలకులు, అధికారులను నిత్యం నిలదీస్తున్నారు. ప్రభుత్వ కార్యక్రమం ఏదీ జరిగినా.. అక్కడికి వచ్చే రాజకీయ నాయకులు, పాలకులకు కంకర తేలిన రోడ్ల సెగే వారిని భయపెడుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక..స్థానికుల్లో కాస్త ధైర్యం వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో పంచాయతీ రోడ్లకు డిప్యూటీ సీఎం, పంచాయతీశాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ పెద్దపీట వేస్తుండటంతో మదనపల్లె-బోడిమలదిన్నె రోడ్డును బాగు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



బెస్తపల్లెక్రాస్‌లో సిమెంటు రోడ్డు దుస్థితి



కొండామరిపల్లెలో కంకర తేలిన రోడ్డు



కొండామరిపల్లె సమీపంలో కరిగిపోయిన బ్రిడ్జి రైలింగ్ గోడ

ఉత్సవ విగ్రహాలుగా ఉన్నత విద్యాలయాలు

● కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి



మాట్లాడుతున్న తులసిరెడ్డి

వేంపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): నిధులు, సిబ్బంది కొరత కారణంగా రాష్ట్రంలో ఉన్నత విద్య నిర్వీర్యమైందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ తులసిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం వేంపల్లెలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్రంలో 17 విశ్వవిద్యాలయాలు ఉండగా 9 విశ్వవిద్యాలయాలకు వైస్ చాన్సలర్లు లేరన్నారు. 474 ప్రొఫెసర్ పోస్టులు, 859 అసోసియేటెడ్ ప్రొఫెసర్ పోస్టులు, 2,147 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. దీంతో ఉన్నత విద్యలో నాణ్యత ప్రమాణాలు క్షీణించాయన్నారు. రూ. 6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు, మెస్ చార్జీల బకాయిలు పేరుకు పోయాయన్నారు. కళాశాల యాజమాన్యాలు సిబ్బందికి జీతాలు ఇవ్వలేక, కరెంటు బిల్లులు కట్టలేక ఇబ్బంది పడుతున్నాయన్నారు. 2020 డిసెంబరు 25న వైసీపీ ప్రభుత్వం జారీ చేసిన జీఓ 77 కారణంగా ప్రైవేట్, ఎయిడెడ్ పీజీ కళాశాలలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్పులు వర్తించక పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యారన్నారు. రాష్ట్రంలో డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమే కాలేదని విచారం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పులివెందుల నియోజకవర్గ సమన్వయకర్త ధ్రువకుమార్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డాక్టర్ సుబ్రమణ్యం, వేంపల్లె మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ, అమర్‌నాథ్‌రెడ్డి, ఉత్త తదితరులు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్ట్‌కు మూడు ఎకరాలు విరాళం



భూమికి సంబంధించిన పత్రాలను ట్రస్ట్ సభ్యులకు అందిస్తున్న దాతలు

తంబళ్లపల్లె జూలై 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లయ్య కొండ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి సేవా సమితి అన్నదాన ట్రస్ట్‌కు తంబళ్లపల్లె మండల కేంద్రం సాలెవీధి వాసి గనుముక్కల శ్రీనివాసులు తమ తల్లిదండ్రులు మునెమ్మ, సుబ్బరాయుడు జ్ఞాపకార్థం అన్నదాన కేంద్రానికి సమీపంలోని మూడెకరాల భూమిని ట్రస్ట్ అభివృద్ధికి విరాళంగా అందజేశారు. ఆదివారం శ్రీనివాసులు కుటుంబ సభ్యులతో కలిసి భూమి పత్రాలను ట్రస్ట్ చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కరీం, అన్నదాన ట్రస్ట్ సభ్యులు నారాయణరెడ్డి, విజయభాస్కర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, రామ్మూర్తి, జయనారాయణరెడ్డి, రఘు,తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



ఓబులేసు మృతదేహం

పెండ్లిమర్రి, జులై 13 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో ఓ యువకుడు మృతి చెందినట్లు ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు చక్రాయపేట మండలం నడింపల్లెకు చెందిన ఇండ్లోల ఓబులేసు (23) నందిమండలం గ్రామస్థుడు జా కీర్‌కు చెందిన పొలానికి కాపలాదారుగా పనిచేస్తున్నాడు. శనివారం రాత్రి నీలం వెంకట శివ అనే వ్యక్తి తన పొలానికి వేసిన విద్యుత్ కంచె తగిలి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. అయితే, అతని మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నట్లు పోలీసులు తెలిపారు.

వన మూలిక తిని వ్యక్తి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడిన వ్యక్తి మృతదేహం

మదనపల్లె అర్బన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): విషపూరితమైన వన మూలిక, బెల్లం తిని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు సీటీఎం, పడమటి వీధికి చెందిన రాజయ్య(62) కూలి పనులు చేస్తూ జీవించేవాడు. రోజు మద్యం తాగి వచ్చి ఇంట్లో గొడవ పడుతుం డడంతో శనివారం రాత్రి భార్య రాజమ్మ ఆయనను మందలించిం ది. దీంతో ఆదివారం ఉదయం ఎవరూ లేని సమయంలో వన మూలిక బెల్లం కలుపుకుని తిని ఇంట్లో స్పృహతప్పి పడిపోయాడు. మధ్యాహ్నం కూలి పనులు పూర్తి చేసుకుని ఇంటికి వచ్చిన భార్య విషయం గమనించి వెంటనే మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, డాక్టర్లు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తాలూకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లారీ బోల్తా



బోల్తాపడిన సిమెంటు ట్యాంకరు

వల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కడప - తాడిపత్రి మండల పరిధిలోని ఎ.ఓబాయపల్లె సమీ పంలో ఆదివారం సాయంత్రం లారీ బోలా పడిందని ఎస్ఐ పెద్ద ఓబన్న తెలిపారు. ఆయన అందించిన సమా చారం మేరకు ఎర్రగుంట్ల నుంచి సిమెంటు లోడుతో వెళుతున్న ట్యాంకరు డ్రైవరు మద్యం మత్తులో వాహనం నడపడంతోనే ఈ ప్రమాదం జరిగిందని తెలిపారు. ఈ సంఘటనలో ఎవరికీ గాయాలు కాలేదన్నారు. కాకపోతే రోడ్డు మధ్యలో పడడం వల్ల కొంత మేర ట్రాఫిక్‌కు ఇబ్బంది కలగడంతో ఎస్ఐ తన సిబ్బందితో వెళ్లి క్రేన్ సాయంతో ట్యాంకరును తొలగించి యథావిధిగా ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

పులివెందుల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పురుగుల మందు తాగి చికిత్స పొందుతున్న ఓ మహిళ ఆదివారం మృతి చెందింది. పులివెందుల మండలం నల్లపురెడ్డిపల్లెకు చెందిన నరితాల రహమత్ (24) జూలై 7 న కడుపునొప్పి తాళలేక పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. ంభర్త అల్లాబాష కుటుంబ సభ్యులతో కలిసి స్థానిక ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడ నుంచి కర్నూలుకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రాఫిక్ సీఐ హాజీవలి తెలిపారు.

గంటలోపే తప్పిపోయిన పిల్లల ఆచూకీ గుర్తింపు

● తల్లిదండ్రులకు అప్పగించిన చిన్నచౌకు పోలీసులు



పిల్లలను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న చిన్నచౌకు సీఐ, ఎస్ఐలు

కడప క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కనిపించకుండా పోయిన ఇద్దరు చిన్నారులను గంట సమయంలోపే గుర్తించిన చిన్నచౌకు పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కర్నూలు జిల్లా సి.బెళగల్ గ్రామానికి చెందిన బోయ వెంకటేశ్ కుటుంబం జీవనోపాధి నిమిత్తం ఇటీవల కడప నగరానికి వలస వచ్చి అశోక్‌నగర్ ప్రాంతంలో నివాసం ఉంటున్నారు. వారు తమ పిల్లలు అశోక్(8), శారద (12)ను స్థానిక పాఠశాలలో చేర్పించేందుకు తమ గ్రామం నుంచి కడపకు తీసుకువచ్చారు. అయితే, అది ఇష్టం లేని చిన్నారులు తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయంలో ఆదివారం సాయంత్రం 5 గంటల సమయంలో కనిపించకుండాపోయారు. చుట్టుపక్కల వెతికినా ఫలితం లేకపోవడంతో చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ ఓబులేసు ఆదేశాల మేరకు సబ్ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, ఎన్.రాజరాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టారు. కేవలం ఒక గంటలోపే ఇద్దరు పిల్లల ఆచూకీ కనుగొని వారి తల్లిదండ్రులకు అప్పగించారు. ఈ సందర్భంగా పోలీసుల కృషిని స్థానికులు కొనియాడారు.

లయన్స్ క్లబ్ సేవలు మరింత విస్తృతం

● ఘనంగా నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం



నూతన కార్యవర్గాన్ని సత్కరిస్తున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

కడప ఎడ్యుకేషన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేయాల్సిన అవసరం ఉందని పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సీహెచ్ రమేష్‌నాథరెడ్డి తెలిపారు. ఆదివారం కడప నగరం మానస ఇన్ సమావేశ మందిరంలో లయన్స్ క్లబ్ ఆఫ్ కడప, అన్నమయ్య జిల్లాల నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించారు. క్లబ్ అధ్యక్షుడు అనంతబొట్ల వెంకటసుబ్బయ్య అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో రమేష్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ సమాజ సేవలో కడప అన్నమయ్య క్లబ్‌కు ఉమ్మడి జిల్లాలోనే మంచి గుర్తింపు వచ్చిందన్నారు. పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ డాక్టర్ ఎం.సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ బాల్యం నుంచే పిల్లలకు తల్లిదండ్రులు సేవా భావం అలవర్చాలన్నారు. కీలక సందేశం ఇచ్చిన పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ జె.రామచంద్ర ప్రకాష్‌రావు మాట్లాడుతూ 50 ఏళ్లుగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అనేక ప్రజోపయోగ కార్యక్రమాలు నిర్వహించామన్నారు. పాస్ట్ మల్టిపుల్ కౌన్సిల్ సెక్రటరీ కె.చిన్నపరెడ్డి దశ నిర్దేశం చేస్తూ సభ్యులందరికి సహకారంతో సమాజ సేవలో ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తామన్నారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి మాట్లాడుతూ అవసరార్థులను ఆదుకోవడమే కాక, డ్రగ్స్ తదితర సామాజిక రుగ్మతల నుంచి యువతను విముక్తి చేయడం, పర్యావరణ పరిరక్షణలాంటి కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించనున్నట్లు తెలిపారు. క్లబ్ అధ్యక్షుడిగా డాక్టర్ ఆర్.రంగనాథరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆదూర శివశంకర్‌రెడ్డి, ఎస్ఎండీ బాషా, టీఎస్ గౌరీశంకర్, కార్యదర్శిగా గునిశెట్టి సాయికుమార్, జాయింట్ సెక్రటరీగా రాఘవేంద్ర వర్మ, కోశాధికారిగా సుబఖ్ తాహిన్, సహ కోశాధికారిగా కొండూరు జనార్దన్ రాజు బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో గునిశెట్టి శ్రీనివాసులు, బోగాల కొండారెడ్డి, వి.గౌరీశంకర్, దేవతి రవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా యల్లమ్మ రథోత్సవం



రథంపై ఊరేగుతున్న యల్లమ్మ అమ్మవారు

కలికిరి, జూలై 13 (ఆంధ్రజ్యోతి): యల్లమ్మ జాతర సందర్భంగా ఆదివారం ఉదయం రథోత్సవం నిర్వహించారు. వివిధ రకాల పుష్పాల తో సుందరంగా అలంకరించిన రథంపై అమ్మవారిని కొలువు దీర్చారు. గృహస్థులు రథాన్ని స్వాగతించారు. అడుగడుగునా భక్తులు సాగిల పడ్డారు. అమ్మవారి రథాన్ని లాగడానికి భక్తులు పోటీ పడ్డారు.

పంచాయతీ కమిటీ అధ్యక్షుడు యోగేష్ రెడ్డి, వెంకట రెడ్డి, మధుసూదనరెడ్డి తదితరులు రథోత్సవాన్ని పర్యవేక్షించారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆలయం వద్ద అమ్మవారికి దివ్వెలు, బోనాలు సమర్పించేందుకు మహిళలు బారులు తీరారు. గ్రామాల నుంచి గుంపులు గుంపులుగా బ్యాండు వాయిద్యాలతో ఊరేగింపుగా వచ్చిన మహిళలు అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రధాన ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి చాందినీ బండ్లు ప్రదక్షిణలు చేశాయి.

ఏసీఏ అండర్-16 క్రికెట్ పోటీల్లో చిత్తూరు, కర్నూలు ఆధిక్యం



ఎం.డి.ఎస్. అక్తర్ (202 పరుగులు)



తేజేశ్ (5 వికెట్లు)



ద్రైవిక్ (58 పరుగులు)

కడప స్పోర్ట్స్, జులై 13 (ఆంధ్రజ్యోతి): ఏసీఏ అండర్-16 మెన్ మల్టీడే క్రికెట్ పోటీల్లో భాగంగా రెండు వే ర్వేరు జట్ల మధ్య ఆదివారం జరిగిన మ్యాచ్‌లలో చిత్తూరు జట్టు 160 పరుగుల ఆధిక్యం సాధించగా, మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 96 పరుగుల వెనుకంజలో నిలిచింది. వివరాలిలా...

కేఓఆర్ఎం మైదానంలో

నగర శివారులోని కేఓఆర్ఎం మైదానంలో చిత్తూరు- కడప జట్ల మధ్య జరుగుతున్న క్రికెట్ మ్యాచ్‌లో టాస్ నెగ్గిన కడప జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో కేవలం 38.4 ఓవర్లలో 139 పరుగులకే ఆలౌట్ అయింది. కాగా చిత్తూరు జట్టు బౌలర్ తేజేశ్ 5 వికెట్లు పడగొట్టాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు మొదటిరోజు ఆట ముగిసే సమయానికి 51 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 299 పరుగులు చేసింది. ఇందులో ఎండీఎస్. అక్తర్ ఏకంగా 202 పరుగులు చేయడం విశేషం. దీంతో చిత్తూరు జట్టు ఇప్పటికే 160 పరుగుల ఆధిక్యం సాధించింది.

ఏసీఏ మైదానంలో

వైఎస్ రాజారెడ్డి క్రికెట్ మైదానంలో టాస్‌నెగ్గిన కర్నూలు జట్టు 74 ఓవర్లలో 177 పరుగులకు ఆలౌట్ అయింది. ద్రైవిక్ 58 పరుగులు చేశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 26 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 81 పరు గులు చేసింది. దీంతో నెల్లూరు జట్టు 96 పరుగుల వెనుకంజలో ఉంది.

మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రొద్దుటూరు , జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇంటి విషయంలో ఏర్పడిన వివాదంతో మనస్తాపానికి గురైన ఓ మహిళ సూపర్ వాస్మోల్ తాగి ఆత్మహత్యా యత్నం చేసింది. రామేశ్వరం మిట్టమడి 9వ వీధిలో ఉండే రెండు సెంట్ల ఇంటి విషయంపై ఎద్దుల ప్రమీలా దేవికి అమరావతి వేణుగోపాల్ మధ్య కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ నేపథ్యంలో 11వ తేదీ మధ్యాహ్నం ప్రమీలా దేవితో ఇల్లు ఖాళీ చేయించేందుకు వేణుగోపాల్ సింహాద్రి పురానికి చెందిన జాకీర్, ఇదయతుల్లాను పురమాయించాడు. వారు ఆమె ఇంటికి వెళ్లి దౌర్జన్యం చేయడంతోపాటు, సామాను చెల్లా చెదురు చేసి బెదిరించారని బాధితు రాలి భర్త మల్లికార్జున తెలిపాడు. 12 తేదీన మున్సిపల్ పార్కు వద్ద ఉన్న మల్లికార్జునను వెంబడించే ప్రయత్నం చేశారని అతను భార్య ప్రమీలా దేవికి ఫోన్‌లో తెలపడంతో ఆమె ఆందోళనకు గురై ఆత్మ హత్యాయత్నం చేసింది. ఈ విషయంపై వన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసినా వారు స్పందించడంలేదని బాధితులు ఆరోపిస్తున్నారు.

భర్త హత్య కేసులో భార్య, ప్రియుడు అరెస్టు

మదనపల్లె అర్బన్, జూలై 13(ఆంధ్రజ్యోతి): భర్తను హత్య చేసిన కేసులో భార్య వనిత, ప్రియుడు రెడ్డిరామ్‌ను అరెస్టు చేసినట్లు తాలూకా సీఐ కళావెంకటరమణ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు మదనపల్లె మండలం, బసినికొండ నక్కలకుంటలో నివాసం ఉంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్న గంగాధర్‌ను జూన్ 15 రాత్రి ఆదివారం ఇంట్లోనే నరికి చంపిన విషయం తెలిసిందే. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేయగా వారు నేరం చేసినట్లు అంగీకరించారు. దీంతో ఆదివారం నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించటన్లు సీఐ చెప్పారు.

బుద్ధుని కొండను పరిశీలిస్తున్న డీఎస్పీ



బుద్ధుని కొండను పరిశీలిస్తున్న డీఎస్పీ మహేంద్ర

మదనపల్లె అర్బన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ధ్వంస మైన బుద్ధుని విగ్రహాన్ని ఆదివారం మదనపల్లె డీఎస్పీ మహేంద్ర పరిశీలించారు. ధ్వంసానికి కారణాలను, ఆరా తీయా లని తాలుకా సీఐ కళా వెంకట రమణను ఆదేశించారు. దుండ గులను గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నయనానందకరంగా విజయదుర్గా,మల్లికార్జునస్వామి కల్యాణం



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

కడప కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మాసోత్సవాలలో భాగంగా ఆదివారం నగర బిల్టప్ సమీప విజయదుర్గాదేవి ఆలయంలో నయనానందకరంగా విజయదుర్గా మల్లికార్జునస్వామికల్యాణం సాగింది. కల్యాణం చేయించినా, తిలకించినా వారికి విశేషమైన ఫలితం దక్కుతుందని, ఏదేని కల్యాణానికి ఆటంకాలున్నా తొలగిపోయి వివాహప్రాప్తి కలుగుతుందని అర్చకులు వెల్లడించారు. కళ్యాణం అనంతరం కర్తలకు ఆలయ వ్యవస్థాపకుడు మల్లికార్జునరావు, నిర్వాహకులు దుర్గాప్రసాద్ అమ్మవారి శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

శిల్పారామంలో అలరించిన ఆటా...పాట

కడప కల్చరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ సమీప శిల్పారామంలో ఆదివారం ఆట విడుపులో భాగంగా అక్కడి సాంస్కృతిక కళావేదికపై అధికారి కృష్ణప్రసాద్ పర్యవేక్షణలో డ్రీమ్ మీడియా సుజాత బృందం వారు వివిధ జానపద, సినిమా పాటలకుచేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఇందులో ప్రధానంగా గోదారి గట్టుమీద రామచిలుకవే.... రాను రాను బొంబాయికి తదితర పాటలకు ఆడిన ఆటాపాట ఎంతగానో అలరించాయి.

సోలార్ కోల్డ్ రూముల పట్ల రైతులకు ఆసక్తి



సోలార్ కోల్డ్ రూము, సోలార్ కోల్డ్‌రూములో నిలువ ఉంచిన పండ్లు

సీకేదిన్నె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రైతుల్లో సోలార్ కోల్డ్ రూములపట్ల ఆసక్తి పెరుగుతోంది. వ్యవసాయంలో రోజు రోజుకూ ఖర్చులు పెరిగిపోయి రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం కష్టంగా మారిన ప్రస్తుత రోజుల్లో వ్యవసాయాన్ని చేయాలంటేనే రైతులు భయపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. పంటలు సాగు చేసి పెంచి సంరక్షించి పంటను కాపాడుకోవడం ఒక ఎత్తు అయితే పండించిన పంట కోసే సమయంలో గిట్టుబాటు ధర లేక నష్టాలకు అమ్ముకోవాల్సి వస్తోంది. దీంతో రైతులు భారీగా నష్టపోతున్నారు. కోసిన పంటను నిలువ చేసుకునే అవకాశం లేక మార్కెట్‌లో ధర ఉన్నా, లేకున్నా అమ్ముకునితీరాల్సిందే. దీంతో ధరుంటే రైతుకు కొద్దో, గొప్పో పెట్టుబడి సాయం వస్తుందని ధర లేకపోతే రైతు నష్టానికైనా అమ్ముకోవాల్సిందేనని వాపోతున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వినూత్నంగా సంచార సోలార్ కోల్డ్‌రూములు రైతులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. రైతులకు ఎటువంటి అనవసరపు ఖర్చులు లేకుండా తక్కువ వ్యయంతో సోలార్ కోల్డ్‌రూములను ఉపయోగించుకోవచ్చు. ఎక్కడికైనా వాటిని తరలించేందుకు కూడా అవకాశం ఉండడంతో రైతులు ఆసక్తి పెంచుకుంటున్నారు.

● ప్రభుత్వం సబ్సిడీ..: సోలార్ కోల్డ్ రూములపట్ల రైతులు ఆసక్తి చూపుతుండడంతోపాటు ప్రభుత్వం సబ్సిడీ కూడా రైతులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ప్రభుత్వం కోల్డ్ రూముల సైజును బట్టి రూ.5 లక్షల నుంచి రూ.10-15 లక్షల వరకు సబ్సిడీ అందిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో రైతులు సోలార్ కోల్డ్ రూములను ఏర్పాటు చేసుకుని కోసిన పంటను నిలువ చేసుకునేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. దీంతో దాదాపు వారం రోజులపాటు నిలువ చేసుకుని పంటను అమ్ముకునే వెసులుబాటు ఉండడంతో ఉద్యాన రైతులు వీటిపై ఆసక్తి కనపరుస్తున్నారు.

● రైతుకు మేలు జరుగుతుంది

ప్రతి సంవత్సరం పూలు సాగు చేసి గిట్టుబాటు ధర ఉన్నా లేకున్నా అమ్ముకోవాల్సి వస్తుండేది. సోలార్ కోల్డ్ రూములు ఏర్పాటు రైతులకు పంటను నిలువ చేసుకుని అమ్ముకునేందుకు ఎంతో అనుకూలంగా ఉంటుంది. పూలు కోసిన వెంటనే మార్కెట్‌కు తరలించాల్సిందే. అలాకాక నిలువ చేసేందుకు అవకాశం ఉండదు. మార్కెట్‌లో ధర ఉన్నా లేకున్నా అమ్మాల్సిందే.

- బాలిరెడ్డి, పూలరైతు, గోర్లపల్లి

● పంటల నిలువకు అనుకూలం

కోసినపంటను నిలువ చేసుకునేందుకు సోలార్ కోల్డ్ రూములు ఎంతగానో ఉపయోగపడుతాయి. ప్రభుత్వ సబ్సిడీకూడా రైతులు సద్వినియోగం చేసుకుని పంటలను కాపాడుకోవచ్చు. మార్కెట్‌లో ధర ఉన్నప్పుడు అమ్ముకుని రైతులు నష్టపోకుండా ఉండవచ్చు. రైతులకు సోలార్ కోల్డ్ రూములపై మరింత అవగాహన పెంచాల్సిన అవసరం అధికారులపై ఉంది.

- భాస్కర్‌రెడ్డి, నాగిరెడ్డిపల్లె, అరటి రైతు

ఉద్యాన పంటలకు బీమా చేసుకోండి

లింగాల,జూలై 13 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 202 ఖరీఫ్‌లో సాగుచేసిన పంటలకు ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన పునర్ వ్యవస్థీకరించిన వాతావరణ ఆధారిత బీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని పులివెందుల ఉద్యాన అధికారి రాఘవేంద్రరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చీనీ, అరటి, పంటలకు బీమా చేసుకునేందుకు ఈనెల 15వ తేదీచివరి రోజు అని, ఎకరా చీనీకి బీమా మొత్తం రూ.60వేలు, రైతు చెల్లించాల్సిన ప్రీమియం రూ.2783, అరటికి బీమా మొత్తం రూ.60500, ప్రీమియం రూ.3062, అలాగే ఉల్లి పంటకు బీమా మొత్తం రూ.45000 ప్రీమియం రూ.90. ఈనెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

18న ఛలో ఢిల్లీ

కమలాపురం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం విభజన హామీలు అమలు చేయడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో ఈ నెల 18న జంతర్‌మంతర్ వద్ద జరిగే ఛలో ఢిల్లీ నిర్వహించడం జరుగుతుందని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ తెలిపారు. ఆదివారం కమలాపురంలో ఛలో ఢిల్లీ పోస్టర్లు ఆవిష్కరణ చేశారు. జిల్లా కమిటీ సభ్యులు యల్లయ్య, నాయకులు నరసింహ, మహేశ్, సన్నీ పాల్గొన్నారు.

రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులకు ప్రైవేటు సంస్థల్లో అవకాశం కల్పించాలి



మాట్లాడుతున్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు దాసరి రమణయ్య

కడప క్రైం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రిటైర్డ్ అయిన ఆర్మీ ఉద్యోగులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇచ్చినట్లే పెద్ద పెద్ద ప్రైవేటుసంస్థల్లో కూడా తమకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఎక్స్ సర్వీస్ మెన్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దాసరి రమణయ్య అన్నారు. కడప నగరం సీఎస్ఐ కాంపౌండులో ఆదివారం రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైర్డ్ అయిన ఆర్మీ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలతో పాటు భూములు కేటాయించాలని, కొంత మంది ఆర్మీ ఉద్యోగుల స్థలాలను సైతం కబ్జా చేశారని ఇలాంటి వాటిపై మనందరం కలిసి చర్చించి కోర్టును ఆశ్రయించడం జిల్లా అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం మంచిదన్నారు. సుదీర్ఘకాలంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం తమ దృష్టికి తీసుకుని వస్తే అధికారుల వద్దకు వెళ్లి వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎక్స్ సర్వీస్‌మెన్‌లో నూతన ఎంపికలను చేశారు. ఉపాధ్యక్షుడుగా అజమల్ ఆలీఖాన్, కోశాధికారిగా కిరణ్‌కుమార్, జాయింట్ సెక్రటరీలుగా సుధాకరరెడ్డి, నాగరాజు, దుర్గాప్రసాద్, బషీర్ మున్సీసాలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు రాముడు, బీవీ గోపాల్‌రెడ్డి, జయరాం, శ్రీనివాసరాజు, లక్ష్మీరెడ్డి, బాలాజీ, చంద్రమోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



గంగమ్మ, యల్లమ్మ

సీకేదిన్నె, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : చింతకొమ్మదిన్నె మండలం తాడిగొట్ల గ్రామంలో వర్షం కోసం గంగమ్మ, యల్లమ్మ దేవతలకు ప్రజలు ఘనంగా పూజలు నిర్వహించారు. ఇటీవల వర్షాలు పడక ప్రజలు ఇబ్బందులు పడుతుండడంతోశనివారం వసంతాలు నిర్వహించి ఆదివారం అమ్మవార్లకు బోనాలు సమర్పించి పూజలు చేశారు. గ్రామస్థులంతా ఒక్కసారిగా బోనాలు ఎత్తుకుని అమ్మవార్ల వద్దకు తీసుకుని వచ్చి సమర్పించారు.

హెచ్చరిక బోర్డులు ఏర్పాటు



ఆదినిమ్మాయపల్లె వద్ద ప్రవహిస్తున్న పెన్నానది, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న పోలీసులు

వల్లూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆదినిమ్మాయపల్లెడ్యాం వద్ద నీటి ఉధృతి ఎక్కువగా ఉందని ఆదివారం హెచ్చరిక బోర్డులను ఎస్ఐ పెద్ద ఓబన్న ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ కొన్నిరోజుల క్రితం శ్రీశైలండ్యాం నుంచి నీరు వదలినందు వల్ల ఆదినిమ్మాయపల్లెడ్యాం వద్ద నీటి ప్రవాహం ఎక్కువగా ఉందని ఆదివారం డ్యాంను సిబ్బందితో కలిసి పరిశీలించినట్లు తెలి పారు. అలాగే సెలవు దినాల్లో పర్యాటకులు ఎక్కువగా డ్యాం వద్దకు వస్తుండడంతో వారికి తెలిపేందుకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి నట్లు ఎస్ఐ తెలిపారు. నీటి ఉధృతి ఎక్కువగా ఉందని పర్యాటకులు జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.

బ్రిడ్జిల నిర్మాణం ఎప్పుడు..?

మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష

కడప ఎర్రముక్కపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): కడప ఎమ్మెల్యే మాటలకే పరిమితమని మాజీ ఉపముఖ్యమంత్రి అంజాద్‌బాష ఆరోపించారు. ఆదివారం కడప నగరం ఇంటర్నేషనల్ కల్యాణ మండపంలో జోన్ స్థానిక విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప శాసన సభ్యురాలుగా గెలిచిన మరుసటిరోజే పదికార్లలో రవీంద్రనగర్ వెళ్లి షామీరియా, లా కాలేజ్ బ్రిడ్జిలు 6 నెలల్లో పూర్తిచేస్తానని హామీ ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఏడాది కాలం పూర్తయినప్పటికీ ఒక్క ఇటుక కూడా కదల లేదని చెప్పారు. కడప నగరంలోని అభివృద్ధి పక్కనపెట్టి ప్రచార ఆర్భాటాలకు ఎమ్మెల్యే అధిక ప్రాధాన్యత ఇస్తూ కాలం గడుపుతున్నారన్నారు. ప్రజలకు సమాధానం చెప్పాల్సిన అవసరం ఆమెకు ఉందన్నారు. అనంతరం మేయర్ సురేష్‌బాబు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు ,కార్పొరేటర్లు,వివిధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమిస్తాం

కమలాపురం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కమలాపురం నియోజకవర్గంలోని సమస్యల పరిష్కారమే ధ్యేయంగా సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమాలను చేపడుతున్నామని సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యుడు పి.చంద్రశేఖర్ తెలిపారు. ఆదివారం కమలాపురంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, అదే విధంగా కమలాపురం నియోజకవర్గంలోని అనేక సమస్యలు పెండింగులో ఉన్నాయని, వాటిని వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు రాయప్ప తదిత రులు పాల్గొన్నారు. కాగా కమలాపురంలోని స్థానిక షాదిఖానాఫంక్షన్ హాలులో సీపీఐ కమలాపురం ఏరియా మహాసభలు నిర్వహించారు. ఈ మహాసభల్లో నూతన కమిటీలను ఎన్నుకున్నారు.

విద్వేషాలు రగిలించే కరపత్రాలు ముద్రిస్తే కఠినచర్యలు : సీఐ



సమావేశం నిర్వహిస్తున్న సీఐ నరసింహులు

వేంపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్వేషాలు రగిలే, రెచ్చగొట్టే కరపత్రాలు , పోస్టర్లు ముద్రిస్తే కఠినచర్యలు తీసుకుంటామని సీఐ నరసింహులు హెచ్చరించారు. వేంపల్లె పోలీస్‌స్టేషన్‌లో ప్రింటింగ్ ప్రెస్, జిరాక్స్ సెంటర్లు, ఇంటర్నెట్ తదితర దుకాణదారుల నిర్వాహకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. పార్టీల మధ్య గాని, వర్గాల మధ్యగాని, గొడవలకు దారి తీసే విధంగా ఏవైనపత్రాలు ముద్రించవద్దని హెచ్చరించారు. ఎవరైనా ముద్రిస్తే కఠినచర్యలు తీసుకుంటామని, కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

నేడు కేసీ కాలువకు నీరు విడుదల

దువ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాజోలి వద్ద కుందూ నది నుంచి సోమవారం కేసీ ప్రధాన కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు డీఈ పుల్లయ్య తెలిపారు. నీటి విడుదల కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొంటారని తెలిపారు. కుందూలో 4,400 క్యూసెక్కుల ప్రవాహం ఉందని ఇది అంచెలంచెలుగా పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

నేడు చాపాడు కెనాల్‌కు నీటి విడుదల

రాజుపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాపాడు కెనాల్‌కు సోమవారం సాయంత్రం నీటిని విడుదల చేస్తున్నట్లు చాపాడు కెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోగ్య సమస్యలతో హైదరాబాదులో ఉన్నందున ఈ కార్యక్రమాన్ని అందరూ కలిసి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు సాయంత్రం 3గంటలకు వెల్లాలోని రాజోలి ఆనకట్ట వద్దకు రావాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించండి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ సీపీఐ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకటజనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఒక డీఏ, కూటమి ప్రభుత్వంలో రెండు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2023 మే నుంచి ఇప్పటి వరకు సరండర్ లీవ్‌లు జమ చేయలేదని తెలిపారు రిటైర్డు అయిన ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యూటీ, కమ్యూటేషన్లు రావడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాధవరెడ్డి, రిజ్వాన్‌ఆలీ, పరమేశ్వర పాల్గొన్నారు.

ప్రజలు సహకరించకపోతే అపరిశుభ్రతే



చెన్నూరులో చెత్త సేకరిస్తున్న పారిశుధ్యసిబ్బంది

చెన్నూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మేజరు గ్రామ పంచాయతీ చెన్నూరులో ఇటీవల కాలంలో ఎక్కడిపడితే అక్కడ చెత్తకుప్పలు దర్శనమిస్తున్నాయి. ఇళ్ల నుంచి రాత్రివేళ 10గంటల తరువాత వ్యర్థాలు తీసుకువచ్చి రోడ్లపై వేస్తున్నారు. వాటిని ఉదయమే వచ్చే పారిశుధ్య సిబ్బంది ఆటోరిక్షాల్లో, ట్రాక్టర్లలో తీసుకెళుతున్నారు. అయితే కొంత కాలంగా చెన్నూరు గ్రామ పంచాయతీకి చెందిన చెత్త సేకరణ బండ్లు ఇళ్ల వద్దకే వస్తున్నాయి. దయ చేసి వాటిలో మీ ఇళ్లల్లోని చెత్తను వేయండి, పరిశుభ్రతకు సహకరించండని పదే పదే చెబుతున్నా ప్రజలు మాత్రం చాలా వీధుల్లో పంచాయతీ సిబ్బంది మాటలను పెడచెవిన పెడుతున్నారు. కానీ కొందరు ఆ చెత్తను వ్యర్థాలను వీధుల్లో ఎక్కడిపడితే అక్కడ విసిరేయడం అది సర్వసాధారణంగా మారింది. దీంతో చినుకుపడితే పంచాయతీల్లోని కొన్ని వీధులు మరీ దారుణంగా కనిపిస్తున్నాయి. కుళ్లిన పదార్థాలు సైతం రోడ్లపై వేయడం, పాలిథిన్ కవర్లు ఎక్కడిపడితే అక్కడ విచ్చలవిడిగా వేయడంతో అవి గాలికి కొట్టుకెళ్లి పలు చోట్ల రోడ్లపై మురికిమయంగా మారి కనిపిస్తున్నాయి. వీటిని ఏరోజుకారోజు గ్రామ పంచాయతీ సిబ్బంది తొలగిస్తున్నా మరలా మరుసటి రోజుకల్లా కనిపించడం సర్వసాధారణమైంది. ముఖ్యంగా ప్రధాన వీధులు, రోడ్ల లో చెత్త కుప్పలు కుప్పలు తెప్పలుగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రజలు అవగాహనతో పరిశుభ్రతకు సహకరించాలి. మరి ప్రజల్లో ఎంత వరకు చైతన్యం వస్తుందో పరిశుభ్రతకు ఎలాంటి సహకారం అందిస్తారో వేచి చూడాల్సిందే.

రైతులపై ఎరువుల భారం మోపొద్దు

వేంపల్లె, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రైతులపై ఎరువుల భారం మోపవద్దని వైసీపీ కడప జిల్లా రైతు విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి మస్తాన్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఒక్కొక్క ఎరువుల బస్తా నుంచి రూ.50 నుంచి రూ.265 వరకు పెంచిందన్నారు. వర్షాలు కురవక రైతులు లబోదిబోమంటుంటే మళ్లీ ఎరువుల రేట్లు పెంచడం దారుణమన్నారు. ప్రతి ఏడాది ఎరువుల ధరలు పెంచుకుంటూ పోవడం దారుణమన్నారు. రాష్ట్రంలో రైతులు అప్పుల ఊబిలో కూరుకుపోయారని, కూటమిలో బీజేపీ ఉందని,చంద్రబాబు కేంద్రంతో మాట్లాడి ఎరువుల ధరలు తగ్గించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

నాలుగు నెలల్లో లబ్ధిదారులకు పక్కాగృహాలు అందిస్తాం



పులివెందులలో ప్రజలతో మాట్లాడుతున్న బీటెక్ రవి

పులివెందుల, జూలై 13 (ఆంధ్రజ్యోతి): పులివెందుల మున్సిపల్ పరిధిలో అసంపూర్తిగా ఉన్నపక్కాగృహాలు మరో నాలుగు నెలల్లో పూర్తిచేసి లబ్ధిదారులకు అందిస్తామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. ఆదివారం పులివెందుల పట్టణంలోని ఇస్లాంపురంలో సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటికి టీడీపీ కార్యక్రమంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ఇస్లాంపురంలో ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ పథకాలపై ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ ఛైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి, హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్‌బాష, నాయకులు సిద్దారెడ్డి, మధుసూధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, విజయకుమార్‌రెడ్డి, బీజేపీ నాయకుడు లక్షుమయ్య తదితరులుపాల్గొన్నారు.

సుపరిపాలనతో మొదటి వసంతం పూర్తి

చెన్నూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమాన్ని సమానంగా సుపరిపాలన అందించి ఏడాది కాలం సంతోషంగా పూర్తయిందని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం మండలంలోని రామనపల్లెలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ కూటమి పాలన సంక్షేమ పథకాల కరపత్రాలను అందించడంతో పాటు ఆ కుటుంబానికి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలపై వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి వేల్పుల సుబ్రహ్మణ్యం, బీసీ సెల్ మండల నాయకులు బడిగింజల మురళి, లతా గురప్ప, విశ్వబ్రాహ్మణ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు భవానీ ఆచారి, వీరప్ప పాల్గొన్నారు.

కులమతాలకతీతంగా సంక్షేమ ఫలాలు

కమలాపురం రూరల్, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కులమతాలకతీతంగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో అన్ని సంక్షేమ ఫలాలు అందుతున్నాయని కౌన్సిలర్ బాబులు తెలిపారు. ఆదివారం నగర పంచాయతీలోని బీడీకాలనీలో 20 బూత్‌లో షేక్ బాబుల్ ఆధ్వర్యంలో సుపరిపాలనకు తొలి అడుగులో భాగంగా ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య



నాగస్వర్ణలత
ఎంఈవో, ఖాజీపేట

ముఖాముఖి

ఖాజీపేట, జూలై 4 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటు స్కూళ్లకు దీటుగా మెరుగైన విద్యనందిస్తున్నామని మండల విద్యాశాఖాధికారి నాగస్వర్ణలత పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులతో విద్యాబోధన అందించడం జరుగుతుందని 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు.

పశ్న: మండల పరిధిలో ప్రభుత్వపాఠశాలలు ఎన్ని ఉన్నాయి. ?

జవాబు: మండలంలో 65 మండల పరిషత్‌పాఠశాలలు, అయిదు జిల్లా పరిషత్ హైస్కూళ్లు, ఒకటి కస్తూర్బాగాంధీ బాలికోన్నత విద్యాలయం, ఒకటి మోడల్ స్కూల్ ఉన్నాయి.

పశ్న: ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఎంత ఉంది ?

జవాబు: ప్రభుత్వ పాఠశాలల్లో 3,163 మంది, ప్రైవేటు పాఠశాలల్లో 3,830 మంది విద్యార్థులు ఉన్నారు.

ప్రశ్న: ఉపాధ్యాయుల కొరత ఏమైనా ఉందా?

జవాబు: ప్రస్తుతం ప్రభుత్వం పాఠశాలల్లో ఎటువంటి ఉపాధ్యాయుల కొరత లేదు.

పశ్న: పిల్లలకు బ్యాగు, పాఠ్యపుస్తకాలు అందాయా. ?

జవాబు: పిల్లలందరికి ప్రభుత్వం సకాలంలో అందించింది. ప్రస్తుతం ఎవరైనా చేరితో వారికి మాత్రమే ఇవ్వాల్సి ఉంది.

పశ్న: ఇద్దరు టీచర్లు ఉన్నచోట ఒకరు ముందు వెళ్లిపోతున్నారన్న ఆరోపణలున్నాయి? నిజమేనా?

జవాబు: సమయ పాలన తప్పనిసరిగా పాటించాలి. ఎక్కడైనా ముందు వెళ్లితే విద్యార్థుల తల్లిదండ్రులు మా దృష్టికి తీసుకొస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం.

నేడు చాపాడు కెనాల్‌కు నీరు విడుదల

రాజుపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చాపాడు కెనాల్‌కు సోమవారం సాయంత్రం నీటిని విడుదల చేస్తున్నట్లు చాపాడు కెనాల్ డిస్ట్రిబ్యూటరీ ఛైర్మన్ ధనిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి ఆరోగ్య సమస్యలతో హైదరాబాదులో ఉన్నందున ఈ కార్యక్రమాన్ని అందరూ కలిసి నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు. మండలంలోని టీడీపీ నాయకులు సాయంత్రం 3గంటలకు వెల్లాలోని రాజోలి ఆనకట్ట వద్దకు రావాల్సిందిగా ఆయన పేర్కొన్నారు.

నిబంధనలకు నీళ్లు

●పొలాల్లో పనిచేసిన చోటే చెక్‌డ్యాంల నిర్మాణాలు ● పనుల పద్ధతి సరిగా లేదంటున్న వైనం ● వంతపాడుతున్న అధికారులు

దువ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి):చెక్‌డ్యాంల నిర్మాణాల్లో నిబంధనలకు నీళ్లు వదులుతున్నారు. పొలాల్లో పనిచేసిన చోటే మళ్లీ పనులు చేస్తూ నాణ్యత లేకుండా ఉంటున్నాయని పలువురు ఆరోపిస్తున్నారు. రైతుల ప్రయోజనాల కోసం ప్రస్తుత ప్రభుత్వం సాగునీటి సంఘాలను ఏర్పరచి ఆయకట్టు పరిధిలో సాగునీరు సక్రమంగా రైతులకు అందాలనేది లక్ష్యం. అయితే దీనిలో ఎవరంటే వారు పనులు చేయడం అరకొరగా వాటిని మమ అనిపించడం సంబంధిత అధికారులు వారికి వంతపాడడంతో లక్ష్యం నీరుగారుతోంది. వివరాల్లోకి వెళితే. మండలపరిధిలోని దువ్వూరు నీటి సంఘానికి నిధులు మంజూరయ్యాయి. మూడు చోట్ల ఈ నిధులతో పనులు చేస్తున్నారు. దువ్వూరు అలుగు వంక ద్వారా ప్రవహించే కాలువకు సంబంధించి రూ.9 లక్షలతో, వెలువలి స్లూయిస్‌కు సంబంధించి మురళీనగర్ వద్ద పొలాల్లో పనిచేసే నిమిత్తం రూ.5 లక్షలు, దువ్వూరు కంబైన్డ్ స్లూయిస్ దిగువన పొలాల్లో పనులు చేసేందుకు రూ.5 లక్షలు కేటాయించారు. అలుగు వంక దిగువ పొలాల్లో చెక్‌డ్యాం నిర్మాణం చేపట్టారు. ఈ ప్రాంత రైతులకు దీని నిర్మాణం సమస్యగా మారింది. ఇక్కడ చెక్‌డ్యాం నిర్మాణం వలన తమ పొలాలు ముంపునకు గురవుతాయని రైతులు వాపోతున్నారు. పనులు చేపట్టే విషయం తెలుసుకుని ఈ ప్రాంతంలో భూములు కలిగిన కొందరు రైతులు నిర్మాణ సమయంలోనే వాటికి అభ్యంతరం తెలిపారు. కాగా ఇదే స్థలంలో గతంలో రెండుమార్లు పనులు జరిగినా రైతులకు ఒరిగిందేమీ లేదనేది రైతుల వాదన. మురళీనగర్ సమీపంలో వాసుదేవపురంవెళ్లే దారిని ఆనుకుని మరో పనిని చేపట్టి రెండు రోజుల్లో ముగించారు. ఇక్కడ భూముల్లోకి నీరు వెళ్లేందుకు వీలుగా కాలువ ఉందని రైతులు పేర్కొంటున్నారు. దువ్వూరులోని కంబైన్డ్ స్లూయిస్ దిగువన కాలువలో మరో పని మొదలు పెట్టి సోమవారం కేసీ కాలువకు నీరు వదులుతున్న విషయం తెలిసి చకచకా పనులు చేస్తున్నారు. ఇక్కడ కాలువ గుండా ప్రతి యేటా ఇబ్బంది లేకుండా నీటి సరఫరా జరుగుతోంది. ప్రస్తుతం చేస్తున్న ఈ పని వలన ఎవరికి ఉపయోగమని సమీప పొలాల రైతులు పేర్కొంటున్నారు. మండలంలో ఆయకట్టు పరిధిలో చేయాల్సిన పనులు చాలాఉన్నాయని కొందరు కేవలం బిల్లుల కోసం ఆ పనులను చేసి మమ అనిపిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.



దువ్వూరు సమీప పొలాల్లో పనిచేసిన చోటే మళ్లీ కట్టిన చెక్‌డ్యాం



కేసీకి నీరు వదిలే ఒక రోజు ముందు నిరుపయోగమైన చోట నిర్మాణ పనులు

ఏఈ ఏమన్నారంటే: దువ్వూరు పరిధిలో జరుగుతున్న మూడు పనులు రైతుల అవసరాలకు అనుగుణంగా చేయిస్తున్నామని దువ్వూరు కేసీ కాలువ ఏఈ పవన్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. రైతుల పొలాలకు నీరు అందడంలేదంటేనే చెక్‌డ్యాం నిర్మించామని మురళీనగర్ వద్ద కాలువలో రెండువైపుల నీరు వెళ్లేందుకు ఈ పని చేయించాం. కంబైన్డ్ స్లూయిస్‌కింద దిగువ పొలాలకు నీరు వెళ్లేందుకు పని నాణ్యతగా చేయిస్తున్నాం. అధికారులు ఎవరికీ వంతపాడడంలేదని ఈ ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు.



మైదుకూరు పట్టణంలోని నంద్యాల రోడ్డులోగల ప్రభుత్వాస్పత్రి సమీపంలో పెద్ద వేపచెట్టు పూర్తిగా ఎండిపోయి కొమ్మలు విరిగి రోడ్డుపై వెళ్లే వాహనాలపై పడుతున్నాయి. ఈ ఘటనలో కొందరు వాహనదారులు ప్రమాదాలకు గురైన ఘటనలున్నాయి. ఎప్పుడైనా ఈ చెట్టు ఉన్నట్టుండి కూలిపోతే ప్రమాదాలు జరుగుతాయని పలువురు వాపోతున్నారు. అధికారులు స్పందించి వెంటనే ఎండినచెట్టును తొలగించి దాని స్థానంలో కొత్త మొక్కను నాటాలని స్థానికులు కోరుతున్నారు. -మైదుకూరురూరల్, (ఆంధ్రజ్యోతి)

ప్రజల సమస్యలు పరిష్కరిస్తాం



ఇంటింటికి కరపత్రాలు అందిస్తున్న సర్పంచ్ వెంకటసుబ్బయ్య

ఖాజీపేట, జూలై 13 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని సర్పంచ్ కొంగాని వెంకటసుబ్బయ్య అన్నారు. ఆదివారం భూమాయపల్లె పంచాయతీలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం సందర్భంగా ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించడంతోపాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ నియోజకవర్గ అధ్యక్షుడు తుట్టే రాము, ఐటీడీపీ మండలాధ్యక్షుడు యేసుపాదం, టీడీపీ నాయకులు గంగాధర్, రమణ, శ్రీనివాసులు, ఓబులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు కేసీ కాలువకు నీరు విడుదల

దువ్వూరు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాజోలి వద్ద కుందూ నది నుంచి సోమవారం కేసీ ప్రధాన కాలువకు నీరు విడుదల చేస్తున్నట్లు డీఈ పుల్లయ్య తెలిపారు. నీటి విడుదల కార్యక్రమంలో మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ పాల్గొంటారని తెలిపారు. కుందూలో రూ.4,400 క్యూసెక్కుల ప్రవాహం ఉందని ఇది అంచెలంచెలుగా పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు.

ఉప్పలూరులో ఘనంగా మొహర్రం

కాశినాయన జూలై13(ఆంధ్రజ్యోతి) ఉప్పలూరు గ్రామంలో ఆదివారం మొహర్రం పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. పీర్లకు ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగంపుతో మొహర్ర పండుగ ముగిసిందని గ్రామస్థులు తెలిపారు.

పండుగలో అపశ్రుతి :మొహర్రం చివరిరోజై ఆదివారం కట్టెలు కాల్చిన గుండంను గ్రామస్థులు ఎక్స్‌కవేటర్ సాయంతో పూడ్చిస్తుండగా ప్రమాధవశాత్తు నిప్పు రవ్వలు, వేడి బూడిద భక్తులపై పడింది.ఈప్రమాదంలో పండుగను తిలకించడానికి వచ్చిన దాదాపు 10 మందికి కాళ్లు, చేతుల కాలాయి. ఇందులో చెన్నారెడ్డిపల్లెకు చెందిన దాదాపు 6 మంది చిన్నారులు ఉన్నట్లు తెలిసింది. వెంటనే గాయపడిన వారిని ఆటోల్లో ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా పల్లా జాతీయ పురస్కారం

ప్రొద్దుటూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం పల్లా జాతీయ పురస్కార ప్రధానోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభాధ్యక్షుడు కొమ్మిశెట్టి మోహన్ మాట్లాడుతూ పల్లా కృష్ణ తన తండ్రి పేరుతో పురస్కారానికి అందజేయడం హర్షణీయమన్నారు. సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి మాట్లాడుతూ ఎనిమిదేళ్లగా పల్లా కృష్ణ సాహితీసేవ చేస్తున్నారన్నారు. రచయిత డీకే చదువులబాబు రచయితకు పల్లా జాతీయ పురస్కారం అందజేయడం హర్షణీయమన్నారు. అనంతరం మంటలు స్నానం కవితా సంపుటిని రచించిన మౌనశ్రీ మల్లిక్‌కు పల్లా జాతీయ పురస్కారం అందజేసి ప్రశంసాపత్రం, జ్ఞాపిక, రూ.7,500 పారితోషికంను అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో సీవీ సురేష్ కవి దస్తగిరి, యువసాహితీ వ్యవస్థాపక అధ్యక్షుడు పల్లా కృష్ణ , కవులు కామనూరు రామమోహన్, తోట రామమోహన్, మహమూద్, పల్లా రామారావు, వెంకటేశ్వర్లు, కాశీవరపు సుబ్బయ్య, బికారిసాహెబ్ పాల్గొన్నారు.

సమైక్యతతోనే బీసీల అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న రంగనాయకులు

ప్రొద్దుటూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): బీసీలు ఐకమత్యంగా ఉన్నప్పుడే అభివృద్ధి సాధించగలరని పెన్షనర్స్ ఉద్యోగ, ఉపాధ్యాయ రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ మాదాసు రంగనాయకులు పేర్కొన్నారు. ఆదివారం బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో పెన్షనర్స్ ఉద్యోగ, ఉపాధ్యాయ పట్టణ జేఏసీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణాలో బీసీలు చైతన్యవంతులై స్థానిక సంస్థలలో 42 శాతం రిజర్వేషన్లు సాధించారని, మన రాష్ట్రంలోనూ రాజకీయాల్లో అధిక సీట్లు సాధించడానికి పోరాటం చేయాలని పేర్కొన్నారు. ఆగస్టులో విజయవాడలో నిర్వహించే మహాసభలకు ప్రొద్దుటూరు నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లు తరలి రావాలని కోరారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం స్టేట్ అడిషనల్ జనరల్ సెక్రటరి వెంకటకృష్ణయ్యయాదవ్, చెన్నయ్య, వెంకటరాముడు, భాస్కరరావు, ఇడెం లక్ష్మీనారాయణ, మాదాసుమురళి, దేవానంద్,పాల్గొన్నారు.

ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి



విద్యార్థినులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ గిరీష్

మైలవరం, జూలై 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు ఆరోగ్యంపట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని డాక్టర్ గిరీష్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రరంలోని బీసీ బాలికల వసతి గృహంలో ఉచిత ఆక్యుపెషర్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలోని బాలికలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం డాక్టర్ గిరీష్ పిల్లలకు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి తదితర వాటిపై వివరించారు. కార్యక్రమంలో హాస్టల్‌వార్డెన్ సుజాత పాల్గొన్నారు.

ఏపీఎన్‌జీజీఓ తాలుకా అధ్యక్షుడిగా చంద్రమౌళి



ఎన్నికైన వారితో ఏపీఎన్‌జీజీఓ నూతన కార్యవర్గం

మైదుకూరు రూరల్, జులై 13 (ఆంధ్రజ్యోతి) :మైదుకూరు తాలుకా ఏపీఎన్‌జీజీఓ అధ్యక్షుడిగా గజ్జెల చంద్రమౌళి ఎన్నకయ్యారు. స్థానిక మండల అభివృద్ధి కార్యాలయ ఆవరణలో ఎన్ని కల అధికారి జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీని వాసులు, సహాయ ఎన్నికల అధికా రి రాజశేఖర్, అబ్జర్వర్ రవికుమార్ ఆధ్వర్యంలో ఆదివారం ఏపీఎన్‌జీఓ ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో మైదుకూరు తాలుకా అధ్యక్షుడుగా చంద్రమౌళి, కార్యదర్శిగా మాచనూరు రాఘవ య్య, కోశాధి కారిగా లక్కినేనిబాబు, ఉపాధ్యక్షులుగా పెంచల్‌రెడ్డి, రాజన్న, గురుప్ర సాద్, మేరీ, సంయుక్త కార్యదర్శులుగా డాక్టర్ సుధ, పద్మావతి, మునెయ్య, రామ గుప్త, తులశ మ్మలను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ప్రొద్దుటూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూలులో 1986-87 పదవ తరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం పాఠశాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కడప డిప్యూటీ డీఈవో రాజగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం హర్షణీయమన్నారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పాఠశాలకు విద్యుత్ సౌకర్యం కల్పించడానికి చర్యలు తీసుకుంటామని పూర్వ విద్యార్థులు హామీ ఇచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు గీత, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

చర్చి ఎన్నికలలో ఇగ్నైట్ ప్యానెల్ ఘన విజయం

బద్వేలు, జూలై13 ,ఆంధ్రజ్యోతి : పట్టణంలోని సెయింట్ పాల్స్‌టౌన్ చర్చిలో శనివారం జరిగిన పాస్రేట్ కమిటీ ఎన్నికలలో ఇగ్నైట్ ప్యాకెల్ ఘనవిజయం సాధించింది. ప్రతిష్టాత్మకంగా జరిగిన ఈ ఎన్నికలలో జనరల్ విభాగం నుంచి ఇమ్మరాజు విలియం బెనహర్, నాగదాసరి చెన్నరాయుడు, అల్లూరి సుధాకర్ స్త్రీల విభాగం నుంచి మేరి జయశీల, యూత్ విభాగం నుంచి రాజా లారెన్స్ గెలుపొందినట్లు తెలిపారు. ఎన్నికల అధికారిగా బద్వేలు సీఎస్ఐ సెయింట్ పాల్స్ టౌన్ చర్చి డీనరీ చైర్మన్ వేల్పుల ప్రసాద్‌బాబు వ్యవహరించారు.

అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ ఇవ్వాలి

జమ్మలమడుగు, జూలై 13 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల కోసం నోటిఫికేషన్ ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యుడు ప్రసాద్ కోరారు. ఆదివారం ఎన్జీవో హోంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 2025-26 విద్యాసంవత్సరం ప్రారంభమై దాదాపు రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు అడ్మిషన్ నోటిఫికేషన్ ఇవ్వకుండా విద్యార్థులను చదువుకు దూరం చేసే పరిస్థితి ఉందన్నారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ సభ్యులు అరుణ్, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోట పోలేరమ్మ తల్లికి బోనాలు



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి

పోరుమామిళ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి):మండలంలో పోరుమామిళ్లలోని మోరవీధి, ఎరసాల, రౌతుపల్లెల్లో సీతారామ లక్ష్మణ హనుమత్ సమేత కోదండరామస్వామి విగ్ర హ ప్రతిష్ఠ కార్యక్రమాలు 41 రోజులు పూర్తయిన సందర్భంగా కోట పోలేరమ్మ అమ్మవా రికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా పోరుమామిళ్లలోని మూలవీధిలో కోదండ రామస్వామి ఆలయంలో స్వామి శివరామానంద సరస్వతి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. బద్వేలు టీడీపీ యువనేత రితీష్‌కుమార్‌రెడ్డి, కూట మి నేత బొజ్జా రోశన్న, టీడీ పీ మండల పార్టీ అధ్యక్షుడు నగరి భైరవ ప్రసాద్, నాయ కులు కొండా రామక్రిష్ణారెడ్డి, కల్లూరి వెంకటక్రిష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ శెట్టెం ప్రతాప్ మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ సాదనకారి రంతు, ఇమాంహుసేన్, సీతావెంకటసుబ్బ య్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ లైన్లకు తగులుతుండడంతో చెట్లు తొలగింపు

రాజుపాలెం, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెల్లాల బాలయోగి గురుకుల పాఠశాలలో కరెంటు తీగలకు చెట్ల కొమ్మలు తగులుతుండంతో వాటిని తొలగించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ తులశమ్మ తెలిపారు. ఆ మేరకు ఆదివారం ఆమె పత్రికా ప్రకటన విడుదల చేశారు. పాఠశాల ఆవరణలో విద్యుత్ లైన్లకు తగిలి ప్రమాదకరంగా ఉండడంతో ఐదు చెట్లను తొలగించి వాటి ద్వారా వచ్చిన డబ్బులను డీడీ రూపంలో ప్రభుత్వానికి చెల్లించినట్లు తెలిపారు.

ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మెకు మద్దతు తెలుపుతున్న కాంగ్రెస్ పార్టీ నేత

ప్రొద్దుటూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎస్.ఇర్ఫాన్‌బాష పేర్కొన్నారు. ఆదివారం మున్సిపల్ కార్యాలయం వద్ద సమ్మె చేపట్టిన మున్సిపల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్లకు ఆయన మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 25 రోజులుగా ఔట్‌సోర్సింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేసి సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణాధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించండి



మాట్లాడుతున్న వెంకటజనార్దన్‌రెడ్డి

ప్రొద్దుటూరు టౌన్, జూలై 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ సీపీఐ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి వెంకట జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం సంఘం కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో ఒక డీఏ, కూటమి ప్రభుత్వంలో రెండు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. 2023 మే నుంచి ఇప్పటి వరకు సరండర్ లీవ్‌లు జమ చేయలేదని తెలిపారు. సీపీఎస్ ఉద్యోగులకు గత పీఆర్‌సీ అమలు చేసినప్పటి నుంచి డీఏ బకాయిలను ఇంతవరకు వారి ఖాతాలకు జమ చేయలేదని తెలిపారు. రిటైర్డు అయిన ఉద్యోగులకు రావాల్సిన గ్రాట్యూటీ, కమ్యూటేషన్లు రావడం లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాధవరెడ్డి, రిజ్వాన్‌ఆలీ, పరమేశ్వర, మస్తాన్‌వలి, ఈశ్వర్‌రెడ్డి, నాగేంద్రారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ రెచ్చగొట్టే వ్యాఖ్యలతోనే గుడివాడలో ఘర్షణ



సమావేశంలో మాట్లాడుతున్న నల్లబోతుల నాగరాజు

ప్రొద్దుటూరు , జూలై 13 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా జడ్పీ ఛైర్‌పర్సన్ వైసీపీ నేత ఉప్పల హారిక రెచ్చ గొట్టే వ్యాఖ్యలతోనే గుడివాడలో ఇరువర్గాల మధ్య ఘర్షణలకు దారి తీసినట్లు వాల్మీకి బోయ కార్పొరేషన్ డైరెక్టర్ నల్లబోతుల నాగరాజు వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏడాది సందర్భంగా చేపట్టిన సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్న టీడీపీ నాయకులపై జడ్పీ ఛైర్‌పర్సన్ కారు నిలబెట్టి కావాలనే కుట్రపూరితంగా రెచ్చగొట్టి ఘర్షణలను సృష్టించారన్నారు. మాజీ మంత్రి పేర్ని నాని ఈ సంఘటనకు కులం రంగు పులిమి బీసీలను వాడుకొని రెచ్చగొట్టే యత్నాలు చేస్తున్నారని దుయ్యపట్టారు. సమావేశంలో టీడీపీ నాయకులు దుగ్గిరెడ్డి రఘునాథరెడ్డి, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూలు అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలి

పోరుమామిళ్ల, జూలై 13 (ఆంధ్రజ్యోతి) : ఓపెన్ స్కూలు అడ్మిషన్లు పెంచేందుకు కృషి చేయాలని జిల్లా ఓపెన్ స్కూలు సమన్వయకర్త సాంబశివారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆయన పోరుమామిళ్లలోని ఎమ్మార్సీ భవనం ఎదుట ఓపెన్ స్కూలుకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఓపెన్‌స్కూలు ప్రాముఖ్యతను వివరించి అడ్మిషన్లను పెంచేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కొండిశెట్టి, ఉపాధ్యాయులు బాలరాజు, ప్రకాశ్, పుల్లయ్య, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.